విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 29, ఆగస్టు 2025

విరిగిపడ్డ కొండ చెరియలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: మండలంలోని ఎగువ అహోబిళం క్షేత్రంలో మెట్ల మార్గంలో బుధవారం తెల్లవారుజామున కొండ చెరియ విరిగి పడి చెట్టు, కరెంట్ స్తంభం నేల కూలాయి. ఈ సమయంలో భక్తులు ఎవరు మెట్లపైన సంచారం లేక పోవడంతో పెను ప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు తెగి పడిపోయాయి. విద్యుత్ శాఖ అధికారులు సప్లై నిలిపి వేసి మరమ్మతులు చేపట్టారు. విద్యుత్ ఏడిఈ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వెంటనే చర్యలు తీసుకుని సిబ్బందిని పంపించి విద్యుత్ లైన్ మరమ్మతులు చేసి దేవస్థానానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఎంపీడీవో నూర్జహాన్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.

ప్రమాదకరంగా యాగంటి

- మద్దిలేటి స్వామి ఘాట్ రోడ్డులో విరిగిన రోడ్ల పారాపిట్ గోడలు
- తీవ్ర భయాందోళనలో ప్రయాణికులు
- ప్రాణాపాయం జరగకముందే మరమ్మతులు చేపట్టాలి
- సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

విశాలాంధ్ర - బనగానపల్లె రూరల్ : మండలంలోని యాగంటి నుండి మద్దిలేటి స్వామి వెళ్లే ఘాట్ రూట్‌లోని రోడ్ పారాపిట్ గోడలు విరిగిపోవడంతో యాత్రికులకు, సమీప గ్రామాల వాహనదారులకు ప్రాణాపాయం పొంచి ఉందని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు తెలిపారు. గురువారం ఘాట్ రోడ్‌లో విరిగిపడ్డ ప్రదేశాన్ని సందర్శించారు. అనంతరం రంగనాయుడు మాట్లాడుతూ ఫతేనగర్, కటికవాని కుంట గ్రామస్తులకు, మద్దిలేటి స్వామి ఆలయానికి వెళ్లే భక్తులకు ప్రమాదకరంగా మారి పడిపోయిన రోడ్డు ప్రహరీ గోడలను అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేయాలని సీపీఐ తరపున డిమాండ్ చేశారు. స్థానిక మంత్రి రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి చొరవ తీసుకొని విరిగిపడ్డ ప్రహరీ గోడ మరమ్మత్తు పనులు వెంటనే చేయించాలని సీపీఐ తరపున డిమాండ్ చేశారు. ఈ దారిలో ఎక్కువగా వాహనాలు తిరుగుతుండడంతో రద్దీగా ఉండడం వలన ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున వెంటనే అధికారులు స్పందించి మరమ్మత్తు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల సమస్య పరిష్కారం కాకపోతే పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని రంగనా యుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శివయ్య, జిల్లా సమితి సభ్యులు సుబ్బారెడ్డి, గంగన్న, రమేష్, రాఘవేంద్ర మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నాడు వెలవెల.. నేడు కళ కళ

విశాలాంధ్ర-అవుకు: గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా సంఘపట్నం చెరువు నీరు లేక వేలవేల పోయిందని మండల తెలుగుదేశం అధ్యక్షుడు ఉగ్రసేనారెడ్డి అన్నారు. గురువారం చెర్లోపల్లి వద్ద హెడ్ రెగ్యులేటర్ల వద్ద ఉన్న సంఘ పట్నం ఎత్తిపోతల పథకము ద్వారా సంఘ పట్నం చెరువుకు ఎంపీటీసీ ఎస్ రామకృష్ణ రెడ్డి తో కలిసి ఉగ్రసేనారెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం పై గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా సంఘ పట్నం చెరువులో నీరు లేక రైతులు నానా అవస్థలు పడ్డారన్నారు. నేడు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి చొరవతో సంఘ పట్నం చెరువుకు నీరు చేరడంతో జలకలను సంతరించుకుందని అన్నారు. 2019లో నాటి శాసనసభ్యుడు బీసీ జనార్దన్ రెడ్డి చొరవతో సంఘ పట్నం చెరువుకు నీరు అందించేందుకు 2.65 కోట్లతో సంఘ పట్నం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారన్నారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఈ పథకం వైపుకు కన్నెత్తి కూడా చూడలేదని అన్నారు. కొంతమంది ఆగంతకులు పైపులను ధ్వంసం చేశారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన ఆరు నెలలలోనే దెబ్బతిన్న పైపులను రాష్ట్ర మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి 3.5 లక్షల సొంత నిధులతో మర మ్మతులు చేయించి నేడు పున ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ పథకం వలన 255 ఎకరాలకు ప్రత్యక్షంగా, 145 ఎకరాలకు పరోక్షంగా నీరందుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులందరి తరపున మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి భాస్కర్ రెడ్డి, మారం పుల్లారెడ్డి, రఘునాథ్ రెడ్డి, డీలర్ పుల్లయ్య, వకీర గౌడ్ రైతులు పాల్గొన్నారు.

కళారాధన సాంస్కృతిక సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: కళారాధన సాంస్కృతిక సంస్థ గత 24 ఏళ్లుగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని మాతృభూమికి కళార్చన పేరిట పాఠశాల విద్యార్థులకు వివిధ రకాల అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం ఆగస్టులో పరీక్షల నేపథ్యంలో పోటీలను సెప్టెంబర్ 1వ తేదీ నుండి 14 వరకు నిర్వహించనున్నట్లు కళారాధన అధ్యక్ష, కార్య దర్శులు డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ రవికృష్ణలు తెలిపారు. పోటీల వివరాలతో రూపొందించిన పుస్తకాలను రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆవిష్కరించారు. కళారాధన అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మధుసూదన్ రావు, డాక్టర్ రవికృష్ణల నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కళారాధన సాంస్కృతిక సంస్థ ఈ సంవత్సరం రజతోత్సవ ఉత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. కళల వైభవానికి, కళా వైభవాన్ని దేశ వ్యాప్తం చేయడంలో కళారాధన కృషి ప్రశంసనీయ మన్నారు. డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ సెప్టెంబర్ 1 నుండి 14వరకు అనేక పోటీలను పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్నామని, రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారంతో కళారాధన, ఐఎంఏ, లయన్స్ క్లబ్ సంయుక్త నిర్వహణలో ఈ పోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

రైతు సేవా కేంద్రాలలో యూరియా

విశాలాంధ్ర-అవుకు: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో యూరియా అందుబాటులోకి రానున్నదని మండల వ్యవసాయ అధికారి కలిమున్నీసా అన్నారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబరు రెండు లేదా మూడవ తేదీలలో అన్ని రైతు సేవా కేంద్రాలలో యూరియా అందుబాటులోకి వస్తుందని అన్నారు. మండలంలోని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతుల అవసరమైన మేరకు మాత్రమే యూరియా కొనుగోలు చేయాలన్నారు. ముందస్తు నిలువల కోసం రైతులు అధిక మొత్తంలో యురియాను కొనుగోలు చేసి నిల్వ ఉంచరాదని అన్నారు. అలా నిలువ చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.

జాతీయ స్థాయిలో సత్తా చాటిన బాడీ బిల్డర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాలకు చెందిన బాడీ బిల్డర్ షేక్ మొహమ్మద్ హారీస్ జాతీయ స్థాయిలో మరోసారి ప్రతిభ చాటారు. కడపలో జరిగిన మిస్టర్ ఆంధ్ర పోటీలలో 85 కిలోల విభాగంలో నాలుగవ స్థానం సాధించిన హారీస్ తాజాగా ఆగస్టు 24న బెంగళూరులో నెక్స్ట్ లెవెల్ ఫిట్ నెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ బాడీ బిల్డింగ్ పోటీలలో పాల్గొన్నారు. ఈ పోటీల్లో 85 కిలోల బిగినర్స్ విభాగంలో మొదటి స్థానం సాధించి బంగారు పతకం, అడ్వాన్స్ కేటగిరీలో రెండవ స్థానం సాధించి వెండి పతకం తన ఖాతాలో వేసుకున్నారు. హరీస్ విజయంపై వెల్‌నెస్ ఇండియన్ జిమ్ స్థాపకులు, మిస్టర్ ఇండియా గ్రహీత, కోచ్ ఖాజీ ఉస్మాన్ గని, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ ఆయనను అభినందించి కేక్ కోసి శుభాకాంక్షలు తెలిపారు. బాడీ బిల్డింగ్‌లో మరింత సత్తా చాటే విధంగా యువతను తీర్చిదిద్దాలని ఫిరోజ్ కోచ్ ఉస్మాన్‌ను కోరారు.

నాణ్యమైన విద్యను అందించాలి

విశాలాంధ్ర - మిడుతూరు: నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ 2 మల్లికార్జున నాయక్ సూచించారు. గురువారం మండల పరిధిలోని నాగలూటి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతోపాటు రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం చతుర్విధ ప్రక్రియలు నేర్పించాలన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల హాజరు, పాఠశాల చుట్టు పరిసరాలు, మధ్యాహ్న భోజనం తనిఖీ, రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట శేషయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తలనీలాల వేలం పాటలో రూ.51.77 లక్షల రాబడి

విశాలాంధ్ర-పాణ్యం : మండల పరిధిలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలసిన ప్రముఖ సేవ క్షేత్రం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం నందు గురువారం నాడు నిర్వహించిన తలనీలాలు బహిరంగ వేలం వేయడం ద్వారా రూ.5177777 రాబడి వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి రామకృష్ణ తెలిపారు. దేవస్థానం నందు స్వామివారికి ఒక సంవత్సర కాలంలో భక్తులు సమర్పించిన తలనీలాల బహిరంగ వేలం నిర్వహించగా 13 మంది సభ్యులు పాల్గొన్నారు. ఒక్కొక్కరు రూ.2 లక్షలు ధరావత్తు చెల్లించి, పాటలో పాల్గొన్నారు. బనగానపల్లె పట్టణానికి చెందిన బాల ఆంజనేయులు రూ.41 లక్ష 50 వేలకు హెచ్చు పాట దారునిగా ఈ వేలంపాటలో నిలిచారు. అనంతరం షీల్డ్ టెండర్ బాక్స్ ఓపెన్ చేయగా వేలంలో ఎవరు పాల్గొనలేదు. ఈ టెండర్ ఓపెన్ చేయగా గుంటూరు జిల్లా పిడుగురాళ్ల గ్రామానికి చెందిన కాస్మోస్ హెయిర్ ఇంటర్నేషనల్ కంపెనీవారు రూ.5177777లకు హెచ్చు పాట కోర్టు చేసి దక్కించు కున్నారన్నారు. గత సంవత్సరం 42 లక్షల 25 వేల 500 వందల రాగా, ప్రస్తుతం పాట రూ.517777 వచ్చిందన్నారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ.952277 ఆదాయం వచ్చిందన్నారు. గ్రామ పెద్దలు మిలిటరీ సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ స్వామి, సురేష్ స్వామి, ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అర్ధరాత్రివేళ గొర్రె కాపరులపై రాళ్లతో దొంగల దాడి

11 గొర్రెలను ఎత్తుకెళ్లిన దుండగులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని మదనంతపురం గ్రామ పరిధిలో ఈనెల 26న అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గొర్రె కాపర్లపై దాడి చేసి 11 గొర్రెలను ఎత్తుకు వెళ్లారు. వివరాల మేరకు మదనంతపురం గ్రామానికి చెందిన సిగిరి చిన్న రంగప్ప, అతని కుమారుడు రామకృష్ణ గొర్రెలపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఈ నెల 26న గొర్రెల మందను మెపుకు తీసుకువెళ్లి రాత్రి మదనంతపురం అబ్బుల్లాపురం గ్రామాల మధ్య దేవుని మాన్యంలోని ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న ఇనప కంచెలో నిలిపారు. కంచే బయట చేరోవైపు నిద్రిస్తుండగా అర్ధరాత్రి గొర్రెల అలజడితో నిద్ర లేచారు. తమ వద్ద ఉన్న టార్చ్ లైట్ వేసి చూడగా దొంగలు గమనించి వారిపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. దీంతో తీవ్ర భయాందోళన చెంది ప్రాణాలను దక్కించుకునేందుకు ఇరువురు చేరే వరకు వైపుకు కంచెకు దూరంగా పరిగెత్తి మదనంత పురం గ్రామస్తులకు ఫోన్ల ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమై గ్రామ స్తులు మంద వద్దకు చేరుకొనగా అప్పటికే దొంగలు కొన్ని గొర్రెలను చోరిచేసి తీసుకువెళ్లారు. మరోవైపు అబ్బుల్లా పురం గ్రామస్తులకు సమాచారం ఇవ్వగా వాళ్లు అప్రమత్తమై రహదారి వద్ద వేచి చూసినా దొంగలు కనిపించలేదు. దొంగలు అప్పటికే ఇరు గ్రామస్తుల చిక్కకుండా చీకటిలో తప్పించుకుని పారిపోయినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. చోరీకి గురైన 11 గొర్రెల విలువ రూ.లక్ష వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. ఇదే బాధితులకు చెందిన గొర్రె పిల్లలను దాదాపు నాలుగు నెలల కిందట చోరీకి గురైనట్లు గ్రామస్తులు తెలిపారు.

భూ కబ్జాదారులపై పీడీ యాక్ట్‌ను నమోదు చేయాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లా కేంద్రంలో రోజు రోజుకూ భూకబ్జాదారులు పెట్రేగిపోతున్నారని, అమాయకులపై బెదిరింపులు, దాడులు నిర్వహిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, అలాంటి వారిపై జిల్లా పోలీస్ అధికారులు పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబాఫక్రుద్దీన్, సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ లు డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా ఏర్పడినప్పటి నుండి నంద్యాలలో భూకబ్జా దారులు అక్రమంగా నకిలీ పత్రాలు సృష్టించి తప్పుడు రిజిస్టర్లతో భూములను కబ్జా చేసి అసలైన వారసులు వస్తే వారిపై భౌతికంగా దాడులు నిర్వహిస్తున్నారని, అందుకు ఉదాహరణ పట్టణంలో ప్రముఖ వ్యాపారవేత్త గెలివి రామకృష్ణపై దాడి సంఘటన అని,ఏ పార్టీ అధికారం ఉంటే ఆ పార్టీ నాయకునిగా చలామణి అవుతూ అధికార పార్టీ ముసుగులో భూకబ్జాలు, రౌడీయిజాలు ఎక్కువ కావడం, పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం వలన దాన్ని అలుసుగా తీసుకొని భూకబ్జాదారులు పెట్రేగి పోతున్నారని, అలాంటి వారిపై పిడి ఆక్ట్ నమోదు చేసి కఠిన శిక్షల ద్వారా వారికి భయం ఏర్పడుతుందని, వెంటనే ఇలాంటి వారిపై జిల్లా పోలీస్ యంత్రాంగం చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: పట్టణంలోని పలు ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలను గురువారం అధికారులు తనిఖీ చేశారు. ఆళ్ళగడ్డ మండల తహసీల్దార్ జ్యోతి రత్నకుమారి, అగ్రికల్చర్ ఏడిఏ విజయ్ కుమార్, మండల వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి, పట్టణ ఎస్ఐ నగిన, డిప్యూటీ తహశీల్దార్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొని దుకాణాలలోని స్టాక్ రిజిస్టర్, గోదాముల్లో ఉన్న ఎరువుల స్టాక్‌ను పరిశీలించి, వివరాలు నమోదు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ యూరియాను ఎమ్మార్పీ ధరకే అమ్మాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

విశాలాంధ్ర - నందికొట్కూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని నియోజక వర్గ ఎమ్మెల్యే జయ సూర్య టిడిపి నియోజక వర్గ అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని బ్రాహ్మణకోట్కూర్ గ్రామానికి చెందిన ముక్తియార్ రహంతుల్లాకి రూ.1,22,500, కాటేపోగు మేఘనకి రూ.1,95,145, బూరంక్రిష్ణకి రూ.50,250లు సీఎం సహాయ నిధిని లబ్ధిదారులకు అందజేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ వీర ప్రసాద్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్, సర్వోత్తమ్ రెడ్డి, ఖాతా రమేష్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కడియం వెంకటేశ్వర్లు యాదవ్ పాల్గొన్నారు.

విద్యుత్ అమరుల ఆశయాలను సాధిస్తాం : సీపీఐ

విశాలాంధ్ర -డోన్ : పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ చెప్పట్టిన ఉద్యమంలో బషీర్ బాగ్ కాల్పులు జరిపి వారి మృతికి కారణమైన అప్పటి సీఎం, ప్రస్తుత సీఎం చంద్రబాబుకు ఉసురు తప్పదని, వారి ఆశయాలను సాధిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎస్.రంగ నాయుడు అన్నారు. గురువారం డోన్ పట్టణంలోని గాంధీ సర్కిల్లో సీపీఐ ఆధ్వర్యంలో బషీర్ బాగ్ పోలీసుల కాల్పులు మృతి చెందిన. కామ్రేడ్, విష్ణువర్ధన్ రెడ్డి, కామ్రేడ్ రామకృష్ణ, కామ్రేడ్, బాలస్వామి, మృతి వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాతూ ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌ను కదిలించిన చలో అసెంబ్లీ, విద్యుత్ ఉద్యమానికి ఆగస్టు 28, 2000 సంవత్సరం నేటికీ 25 సంవత్సరాలు జరిగిందన్నారు. ఆ ఉద్యమంలో 9 వామపక్షాలు, ఆధ్వర్యంలో బారికేడ్లు, ఫెన్సింగ్‌ను ఛేదించుకుంటూ ముందుకురుకుతున్న ఉద్యమకారులపై లాఠీలతో చెలరేగిన అశ్విక దళం ఒకపక్క, దూసుకొస్తున్న బాష్పవాయు గోళాలు, తూటాలకు నేలరాలరన్నారు. ఉద్యమకారులు మరోపక్క, యుద్ధ వాతావరణాన్ని తలపించిన బషీర్‌బాగ్ సాక్షిగా వామపక్ష కార్యకర్తలైన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాల స్వాములను నాటి చంద్రబాబు ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని, ఆరోపించారు. వందల సంఖ్యలో బుల్లెట్ గాయాలయ్యాయి. మరెందరో క్షతగాత్రులయ్యారు. ప్రపంచ బ్యాంకు సంస్కరణల మోజులో రాష్ట్రాన్ని ప్రమాదకరమైన ప్రయోగశాలగా మార్చిన పాలకులను ఒక అడుగు వెనక్కి వేయించిన ఆ ఉద్యమ స్ఫూర్తి రెండున్నర దశాబ్దాల తరువాత నేటికీ కొనసాగుతూనే ఉందన్నారు. అమరవీరుల జీవితం ఆదర్శప్రాయంగా నిలిచే ఉందన్నారు. అదే స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణలు, ప్రజలపై భారాలు, ప్రభుత్వ ప్రమాదకర విధానాలపై పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కంకణ బద్దలు కావాలని పిలుపునిచ్చారు. సరిగ్గా పాతికేళ్ల క్రితం విద్యుత్ రంగ సంస్కరణల పేరుతో టిడిపి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రపంచ బ్యాంకు తాకట్టు పెట్టిన నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందిస్తామని నమ్మబలికి, విద్యుత్ రంగాన్ని మూడు ముక్కలు చేసిందన్నారు. విద్యుత్ ఉత్పత్తిలోకి ప్రైవేటు కంపెనీలను దించిందన్నారు. అక్రమ ఒప్పందాలు చేసుకుందని, ఆ విధానాల్లో భాగంగా రూ వెయ్యి కోట్ల విద్యుత్ భారాలను ప్రజలపై మోపిందన్నారు. ఈ సంస్కరణలను అధ్యయనం చేసిన వామపక్షాలు, ప్రజా సంఘాలు ముంచుకొస్తున్న ముప్పుపై ప్రజలను చైతన్యవంతులు చేశాయన్నారు. దశలవారీగా రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని నిర్మించాయని, అంతులేని నిర్బంధకాండను ఎదుర్కొంటూనే ఉద్యమం ఉధృతమైంది. చార్జీల విషయంలో వెనకడుగు వేయక తప్పలేదని, చార్జీల పెంపుదలను కొంత కాలం నిలిపివేసిందన్నారు. విద్యుత్ సంస్కరణల బండారాన్ని బట్టబయలు చేసిన ఆ ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రజలను ప్రభావితం చేసిందని, దీంతో సంస్కరణల వేగం కూడా తగ్గింది. పాతిక సంవత్సరాలు గడిచాయన్నారు. అమరవీరుల స్ఫూర్తితో, విద్యుత్, ప్రైవేటీకరణ, ట్రూ అఫ్ చార్జీలకు, స్మార్ట్ మీటర్ల వ్యతిరేకంగానూ, వామపక్షాలు, లౌకిక పార్టీలు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి.సుంకయ్య, మండల కార్యదర్శి బి.నారాయణ, నాయకులు కోయిలకొండ నాగరాజు, పట్టణ సహాయ కార్యదర్శి పుల్లయ్య, మండల సహాయ కార్యదర్శి హుస్సేన్ పీరా, ఏఐటీయూసీ నియోజవర్గ కార్యదర్శి అబ్బాసు, చేతి వృత్తిదారుల సమైక్య జిల్లా కార్యదర్శి ఎం.రామ్మోహన్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి ప్రుధ్వి కుమార్, రాఘవేంద్ర, మనోహర్, దస్తగిరి, కొండయ్య, సుధాకర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు

నంద్యాలలో..

వెలుగోడులో..

నందికొట్కూరులో..

జూపాడుబంగ్లాలో..

బేతంచెర్లలో..

చికిత్స పొందుతూ కోలుకోలేక విద్యార్థి మృతి

విశాలాంధ్ర - జూపాడు బంగ్లా: గత నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ప్రభుత్వా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మోడల్ స్కూల్ విద్యార్థి జయవర్ధన్ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతి చెందాడు. మండలంలోని తరిగోపుల గ్రామానికి చెందిన భూషయ్య, సావిత్రి దంపతుల కుమారుడు జయవర్ధన్ మండల కేంద్రంలోని మోడల్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈనెల 23వ తేదీన పాఠశాలకు వెళ్లి సాయంత్రం పాఠశాల నుండి క్వాటర్స్ లోని బస్టాండుకు నడుచుకుంటూ వెళుతుండగా జయవర్ధన్ ను ట్రాక్టర్ అతివేగంగా వెళ్లి ఢీకొంది. ట్రాక్టర్ ఢీ కోనడంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కోలుకోలేక విద్యార్థి జయవర్ధన్ మృతి చెందాడు. కుమారుడు జయవర్ధన్ మృతి చెందడంతో తల్లిదండ్రులు బంధుమిత్రులు కన్నీటి పర్వంతమయ్యారు.

టీబీ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: ప్రధానమంత్రి టీబి ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా నంద్యాల టీబీ క్లినిక్ నందు టీబీ వ్యాధిగ్రస్తులకు దాతల ద్వారా పౌష్టికాహార కిట్లను పంపిణి చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటరమణ ఇద్దరు టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకున్నారు. అలాగే డాక్టర్ శారదాబాయ్ ఒకరిని దత్తత తీసుకున్నారు. నంద్యాలకు చెందిన శివపార్వతిరెడ్డి పది మందిని దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న 15 మంది వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లను పంపిణి చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ. డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖులు ముందుకు వచ్చి టీబీ వ్యాధిగ్రస్తులను దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒక వ్యాధిగ్రస్తునికి నెలకి 500 రూపాయాలు 6 నెలలకి రూ.3 వేల విలువ చేసే పౌష్టికాహారం అందించవలసి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ తేజస్విని, పీటర్ వసంత్, వినయ్, పిపిఎం కో ఆర్డినేటర్ నాగార్జునరెడ్డి, టీబీ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణ దాతలు కండి

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్న తోటి వారి ప్రాణాలను కాపాడవచ్చని కోవెలకుంట్ల ప్రజా వైద్యశాల వైద్యులు శివారెడ్డి అన్నారు. గురువారం డాక్టర్ శివారెడ్డి ప్రజా వైద్యశాల ఆవరణలో వినాయక చవితి పర్వదినం సందర్భంగా కోవెలకుంట్ల యూత్ ఫ్రెండ్స్ ఫర్ సేవా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో 9వ రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో పట్టణానికి చెందిన సుమారు 50 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం వైద్యులు శివారెడ్డి మాట్లాడుతూ సమాజంలో రక్తహీనతతో బాధపడుతున్న వారికి రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలని యువతకు పిలుపునిచ్చారు. యువ వైద్యులు కళ్యాణ్ రణధీర్ భాను, రణ వైద్యం రమేష్, చిన్న బాబు, గడ్డం రామకృష్ణారెడ్డి, గాదం శెట్టి రమణయ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా చేయడమే ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయడమే ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమమని వయోజన విద్య నోడల్ అధికారి భాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ భవనంలో ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సమాజంలోని అందరికీ జీవిత కాల అభ్యసన, అవగాహనపై వాలంటరీ టీచర్స్‌కు శిక్షణ కార్యక్రమం డ్వామా ఏపీవో వెంకట రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వయోజన విద్య నోడల్ ఆఫీసర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అభ్యాసకులను వయోజన విద్యా కేంద్రాలకు ఏ విధంగా పిలుచుకొని రావాలి, వారికి ఏ విధంగా చదువు చెప్పాలి అలాగే ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత, మరియు సైబర్ నేరాల గురించి వివరించారు. ఏపీవో వెంకటరమణ, వీటిఎస్ అందరూ శ్రామికులకు విద్య నేర్పడంలో కృషి చేసి మనకు కేటాయించిన నిరక్ష్యరాశులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. సూపర్వైజర్ ఆది నరసింహుడు అభ్యాసకులకు ఏ విదంగా పాఠ్యంశాలు చెప్పాలి, గణిత భావనలు ఎలా చెప్పాలి అనే విషయాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి కొరకు కొత్త పైప్‌లైను ఏర్పాటు

విశాలాంధ్ర - పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామ పంచాయతీలోని జె.కొట్టాల గ్రామంలో మెయిన్ పైప్ లైన్ ట్రాక్టర్లు ఇతర వాహనాలు తిరగడం వల్ల పైప్ లైన్ పూర్తిగా పనికి రాకుండా పోవడంతో గ్రామానికి నీటి సరఫరా నిలిచిపోవడంతో గ్రామ సర్పంచ్ చింతల నారాయణ ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా పగిలిపోయిన పైపులను తీసివేసి కొత్త పైపులను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ చింతల నారాయణ మాట్లాడుతూ దయచేసి మిట్టకందాల, జంగాల కొట్టాల, బుద్ధానగర్ గ్రామాల ప్రజలు నీళ్ల పైపులైన్, వీధి కుళాయిలు ఇంటింటి కుళాయిలు డ్యామేజ్ కాకుండా ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు, ఆటోలు, టూ వీలర్ బైక్‌లు చూసి నడపాలన్నారు. మొదటికే నిధులు లేక ఇబ్బంది పడుతున్నామని, ప్రజలు గ్రామ పంచాయతీ వస్తువులను డ్యామేజ్ చేసి నష్టం చేయకుండా జాగ్రత్తగా చూసుకో వాలని కోరారు. గ్రామ ఉపసర్పంచ్ ఆంజనేయులు, టిడిపి యువ నాయకుడు చింతల కుమారస్వామి, వార్డు మెంబర్లు, పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

విశాలాంధ్ర - చాగలమర్రి : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన బోజనాన్ని అందించాలని ఎంఈఓ అనురాధ కోరారు. గురువారం చాగలమర్రి పట్టణంలోని ఎస్టీ కాలనీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం మద్యాహ్న బోజనాన్ని తనిఖీ చేసారు. ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం నిర్వహకులు వంట వండే పరిసర ప్రాంతాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాత్రలను ప్రతిరోజు శుభ్రపరుచుకుని జాగ్రత్త పరచాలని తెలిపారు. ప్రభుత్వ మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని విద్యార్థిని విద్యార్థులు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయ్ కుమార్, సీఆర్పీ ఖాశీంలు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 29, ఆగస్టు 2025

మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహించాం : మంత్రి

విశాలాంధ్ర బ్యూరో -కర్నూలు : ప్రతిపక్ష పార్టీ నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేసిందని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. డీఎస్సీ పోస్టుల భర్తీపై మంత్రి టీజీ భరత్ ఒక ప్రకటన విడుదల చేశారు. పారదర్శకంగా మెగా డీఎస్సీ నిర్వహించామని, ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి, యువ ఉపాధ్యాయులతో విద్య రంగాన్ని దేశంలోనే తొలి స్థానంలో నిలబెడతామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ అభ్యర్థులకు వయస్సు మినహాయింపు ఇచ్చి వారికీ అండగా నిలబడ్డామన్నారు. యువత బాగు పడటం ఇష్టంలేని ప్రతిపక్షనేత మెగా డీఎస్సీని ఆపేందుకు 24 కేసులు వేయించాడన్నారు. అన్నీ తట్టుకొని మెగా డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేసిన ఘనత మంత్రి నారా లోకేష్‌కు దక్కుతుందన్నారు. ప్రభుత్వ విద్యలో విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు గత 14 నెలలుగా సమర్థవంతంగా సంస్కరణలు అమలు చేస్తూ బడులకు నూతన వెలుగులు తెస్తున్నామన్నారు. 2014-2019 మధ్య 2 డీఎస్సీలు జరిపి 18 వేల ఉపాధ్యాయ పోస్టులను టీడీపీ ప్రభుత్వం భర్తీ చేసిందని మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సమగ్ర శిక్షా సొసైటీ ఆధ్వర్యంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న 729 నాన్ టీచింగ్ స్టాఫ్ పోస్టులను భర్తీ చేసిందన్నారు. 90 మంది ఎస్టీ యువతను కొత్తగా ఉపాధ్యాయులుగా నియమిం చిందని, 700 కోయభారతి టీచర్ పోస్టులు భర్తీ చేశామ న్నారు. జూనియర్ కాలేజీల్లో 700 మంది సిబ్బంది సేవలు పునరుద్ధరణ చేశామని, 476 ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 3619 మంది కాంట్రాక్టు లెక్చరర్ల సేవలు పునరుద్ధరణ చేశామన్నారు. టీచర్లపై పని ఒత్తిడి తగ్గించేందుకు గత ప్రభుత్వంలో ఆరు రకాల బడుల విధానం ఉండగా, తమ కూటమి ప్రభుత్వం వాటిని తొమ్మిది రకాల బడులుగా మార్చిందన్నారు. తమ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థను గొప్పగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాల్సిందే : పి.రామచంద్రయ్య

విశాలాంధ్ర-పత్తికొండ: విద్యుత్ స్మార్ట్ మీటర్లను రద్దు చేయాల్సిందేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ, సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ కూడలి నుండి ర్యాలీ చేపట్టి నాలుగు స్తంభాల మండపం దగ్గర బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంలో అసువులు బాసిన అమరులు రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాల స్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.రామచంద్రయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాన్య ప్రజలపై పెను భారం పడే విధంగా విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు నారా లోకేష్ విద్యుత్ స్మార్ట్ మీటర్లను బిగిస్తే పగలగొట్టండి అని చెప్పి, నేడు అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించేందుకు పూనుకోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ట్రూ అప్ చార్జీల పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాల్సిందేన ని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమంలో వామపక్ష పార్టీలకు చెందిన ముగ్గురు కార్యకర్తలు తమ ప్రాణాలను బలిదానం చేశారని వారి పోరాట స్ఫూర్తితో విద్యుత్ చార్జీలు తగ్గించేంతవరకు ఉద్యమాలు చేపడతామన్నారు. సీపీఐ మండల కార్యదర్శి యు.కారుమంచి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి వెంకటేశ్వర రెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాజా సాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, సురేంద్ర కుమార్, కృష్ణయ్య, పెద్ద ఈరన్న, గిడ్డయ్య గౌడ్, నెట్టికంటయ్య, సిపిఎం నాయకులు దస్తగిరి, కాశీ, రవిచంద్ర, రమేష్, వామపక్ష పార్టీల ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి

స్టాండింగ్‌తో ప్రయాణికులు ఇబ్బందులు

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: ఆర్టీసీలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సుల సంఖ్య పెంచాలని ప్రజలు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15 నుండి స్త్రీ శక్తి పథకం అమలు చేయడం వలన రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించింది. ఈపథకం రాష్ట్ర వ్యాప్తంగా సూపర్ సక్సెస్ అయినట్లు ప్రభుత్వం ప్రచారం చేస్తుంది. ఉచిత ప్రయాణంను మహిళలు బారీగానే ఉపయోగించుకుంటున్నారు. దీంతో ఆర్టీసీలో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగింది. మరో వైపు ఈ పథకం అమలులోకి రాక ముందు ఆర్టీసీలో మహిళా ప్రయాణికులు 40 శాతం, పురుష ప్రయాణికుల 60 ఉంటే ప్రస్తుతం ఆ సంఖ్య తారు మారు అయింది. ఈ పథకం అమలులోకి వచ్చిన తరువాత మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం బస్సులో ప్రయాణికులలో 60శాతం మహిళా ప్రయాణికులు ఉంటే 40శాతం పురుష ప్రయాణికులు ప్రయాణిస్తున్నట్లు తెలుస్తుంది. అధిక శాతం బస్సుల్లో స్టాండింగ్‌తో ప్రయాణం చేయవలసి రావడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పథకం ప్రవేశపెట్టిన తరువాత రాష్ట్ర రోడ్డు రవాణా శాఖ బస్సులు పెంచకపోవడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రయాణికుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ యాజమాన్యం బస్సుల సంఖ్య పెంచాల్సిన అవసరం ఉంది. రాష్ట్రప్రభుత్వం 1100 బస్సులు కొత్తవి తీసుకువస్తున్నట్లు తెలియ చేస్తున్నా, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని తొందరగా కొత్త బస్సులు తీసుకు వచ్చి ప్రయాణికులను ఇబ్బందుల లేకుండా సమస్యలు పరిష్కారం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు పట్టణ ప్రణాళిక సమస్యలపై ఓపెన్ ఫోరం

విశాలాంధ్ర - కర్నూలు సిటీ : కర్నూలు నగరంలో పౌరుల సమస్యలను ప్రత్యక్షంగా విని, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టేందుకు శుక్రవారం ఓపెన్ ఫోరం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి.విశ్వనాథ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎస్బిఐ ఉద్యోగుల కాలనీ మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించిన ఎల్ఆర్ఎస్, నిర్మాణ అనుమతులు వంటి సేవలలో తలెత్తుతున్న ఇబ్బందులపై పౌరులు తమ సమస్యలను నేరుగా చెప్పవచ్చున్నారు. పౌరుల ఫిర్యాదులను వెంటనే నమోదు చేసి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశిస్తామని కమిషనర్ తెలిపారు. నగర ప్రజల నుండి అందిన సూచనలు, ఫిర్యాదులు మున్సిపల్ పాలనలో పారదర్శకత పెంచడమే కాకుండా వేగవంతమైన సేవలందించేందుకు తోడ్పడతాయని ఆయన వివరించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

విశాలాంధ్ర - వెల్దుర్తి: మండల పరిధిలోని రామళ్లకోట గ్రామ రైతు కొట్టం రామానాయుడు (33) తన పొలంలోని బోరు మోటారు ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘానికి గురై బుధవారం మృతి చెందాడు. రైతు రామానాయుడు తన భార్య పద్మావతితో కలిసి గ్రామానికి దూరన ఉన్న తన కొండ పొలానికి ఉదయం పూట వెళ్లాడు. సాగు చేసిన మొక్కజొన్న పంటకు బోరు మోటారుతో నీరు పారించాడు. సాయంత్రం భార్య ఇంటికి వెళ్లగా, తాను పొలం పని పూర్తి చేసుకుని బోరు మోటారు ఆఫ్ చేసే క్రమంలో విద్యుదాఘానికి గురై అక్కడే పడిపోయాడు. ఎంతసేపటికి ఇంటికి రాకపోవడంతో భార్య, కుటుంబ సభ్యులు రాత్రి వెళ్లి చూడగా బోరు మోటారువద్ద పడిపోయి కనిపించాడు. కుటుంబ సభ్యులు రైతును మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. గురువారం మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ అశోక్ మృతదేహానికి పోస్టుమార్టంకు ఆదేశించారు. స్థానిక సీహెచ్‌సీకి పోస్టుమార్టం అనంతరం మృతదేహానికి అతని స్వగ్రామంలో అంత్యక్రియలుపూర్తి చేశారు. మృతునికి కుమారుడు, కుమార్తె సంతానం. రైతు మృతిపట్ల గ్రామపెద్దలు తమ సంతాపం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఎల్లార్తి ఊరుసు వాల్ పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - హొళగుంద: జిల్లాలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఎల్లార్తి శేక్షావలి, షాషావలి సాహెబ్‌ల 363 వ ఉర్సు కు సంబంధించిన వాల్ పోస్టర్‌లను రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి. ఫారుక్, ఎల్లార్తి దర్గా ఈవో ఇమ్రాన్, టీడీపీ సీనియర్ నాయకుడు ఈడిగ గోవింద్ గౌడ్, టీడీపీ యువ నాయకులు ఈడిగ రాజేంద్ర గౌడ్, ఎం.మొయిన్, టీడీపీ మండల్ కన్వీనర్ వీరన్న గౌడ్, దర్గా నిర్వాహకుడు షాపిర్ ఖాన్ గురువారం విడుదల చేశారు. గంధం 18న గంధం, 19న ఉరుసు, 20న జీయరత్ కార్యక్రమాలు జరుగు తాయ న్నారు. ఉరుసు ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి సాహెబ్ వారిని దర్శించుకోవాలని కోరారు. టీడీపీ నాయకులు మొయిన్, బంధప్ప, దిడ్డి నాగప్ప, దబ్బే ఎల్లప్ప, కేశ్వి మల్లయ్య పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ నందు విధులు నిర్వహిస్తున్న నాలుగో తరగతి ఉద్యోగులకు సీనియార్టీ జాబితా సిద్ధం చేసి పదోన్నతులు కల్పించాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, వర్కింగ్ ప్రెసిడెంట్ జి.రాముడు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం వారు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రాధికను కలిసి నాలుగో తరగతి ఉద్యోగులకు సీనియార్టీ జాబితాను సిద్ధం చేసి తక్షణమే పదోన్నతులు ఇవ్వాలని కోరినట్లు వారు తెలిపారు. అందుకు సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ స్పందిస్తూ సాంఘిక సంక్షేమ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులందరూ అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వానికి, డిపార్ట్మెంట్‌కు మంచి పేరు తీసుకురావాలని తెలిపార న్నారు. పిల్లలకు మంచి సర్వీస్ అందిస్తూ మంచి ప్రవర్తనతో ప్రజలతో మెలగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, నాయక్ ధనుం జయ, రాజు, మల్లేష్, శంకర్, మద్దిలేటి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ : ఆర్డీవో

విశాలాంధ్ర - ఆలూరు: మండలంలోని హుళ్ళేబీడు గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని గురువారం ఆర్డిఓ భరత్ భరత్ నాయక్ తనిఖీ చేశారు. రైతులకు అవసరమైన అన్ని ఎరువులు అందుబాటులో ఉంచాలని, అందుకు అనుగుణంగా ముందుగా ఇండెంట్ పెట్టుకొని నిల్వలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వం సూచించిన ధరలు కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఆర్బి బసవన్న గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యమ అమరవీరుల సాక్షిగా మరో ఉద్యమాన్ని చేపడతాం

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు: బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల సాక్షిగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేఖంగా మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని వామపక్ష పార్టీలు నాయకులు, కార్యకర్తలు, ప్రతిజ్ఞ పూనారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ముందు 2000 సంవత్సరంలో విద్యుత్ సంస్థలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రాత్మక ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిల వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలువేసి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమానికి సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణా రెడ్డి, సీపీఐ (ఎం) నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్‌లు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు పరిపాలనలో విద్యుత్ సంస్కరణలు తీసుకుని వచ్చిన సందర్భంగా దాదాపు 6 నెలలపాటు విద్యుత్ పోరాటం జరిగిందన్నారు. 2000 జూలై 28వ తేదీ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబు ఉపన్యాసాన్ని అడ్డుకుని విద్యుత్ సంస్కరణలో వెనక్కి తీసుకెళ్లాలని మహా ఉద్యమాన్ని చేపట్టామన్నారు. చంద్రబాబు సభ భగ్నం అయిందని, అదే విద్యుత్ పోరాటానికి నాంది పలికిందని వారు తెలిపారు. 2000 సంవత్సరం ఆగస్టు 28వ తేదీన వేలాదిమంది అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టారని ఆ సందర్భం గా దుర్మార్గంగా చంద్రబాబు ప్రభుత్వం బషీర్బాగ్ దగ్గర కాల్పులు జరిపిందని, లాఠీచార్జి, కాల్పులు జరిపారని ఈ కాల్పుల్లో రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామి మృతి చెందార న్నారు. ఆ తరువాత దాదాపు పదేళ్ల పాటు చంద్ర బాబు నాయుడును అధికారానికి ప్రజలు దూరం పెట్టారని వారు తెలిపారు. జగన్మోహన్ రెడ్డి పాలనలో తండ్రి కొడుకులు చంద్రబాబు లోకేష్ ఇద్దరు కలిసి బాదుడే బాదుడు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా చేపట్టారన్నారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అని ప్రజలకు పిలుపునిచ్చిన ఈ మహానుభావులు అధికారములోకొచ్చిన ఆరు నెలల్లోపే జగన్మోహన్ రెడ్డి ఏ మీటర్లు అయితే ప్రజలకు పెట్టాడో అవే స్మార్ట్ పీటర్లను అదే ట్రూ ఆఫ్ చార్జీలను తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టాడన్నారు. ఇప్పటికైనా ఎన్నికల ముందు తాను ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం స్మార్ట్ మీటర్ల పెట్టే విధానాన్ని వెనక్కి తీసుకోవాలని షకీ ఒప్పందాలను రద్దు చేయాలని అదా నీపై జగన్మోహన్ రెడ్డిపై కేసులు నమోదు చేయా లన్నారు. రాష్ట్రంలో వామపక్షాలు ఇతర రాజకీయ పార్టీల ను కలుపుకొని మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపట్టాల్సి వస్తుందన్నారు. నాయ కులు, కార్యకర్తలు విద్యుత్ ఉద్యమ అమరవీరుల సాక్షిగా మరో విద్యుత్ ఉద్యమాన్ని చేపడతామని ప్రతిజ్ఞ పూనారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.జగన్నాధం, జి.చంద్ర శేఖర్, కె.శ్రీనివాసులు, పి.శ్రావణి, సీపీఐ(ఎం) జిల్లా నాయకులు రాధాకృష్ణ, ఆనంద్ బాబు, గురు శేఖర్, ఎస్‌యూసీఐ నాయకులు నాగన్న, సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు అంజి, పురుషోత్తం, భద్రకుమార్, బీసన్న, సోమన్న, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద కడబూరులో..

ఆస్పరిలో..

ఆలూరులో..

కోడుమూరులో..

అలుపెరగని పోరాటాల యోదుడు బీజీ మాదన్న

విశాలాంధ్ర - కర్నూలు : పెత్తందారి భూస్వామ్య, రెడ్ల చేతిలో అణిచివేతకు గురవుతున వారి పక్షాన అలుపెరగని పోరాటాలు చేసింది కామ్రేడ్ బీజీ మాదన్న అని సీపీఐ నాయకులు అన్నారు. గురువారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ బీజీ మదన్న 8వ వర్ధంతిని కె.తిమాపురం గ్రామంలోని ఆయన స్తూపం దగ్గర నిర్వహించారు. సీపీఐ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ మండల కార్యదర్శి కామ్రేడ్ పి.రాజీవ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, జి.రంగన్న, పార్టీ మండల కార్యదర్శి పి.రాజీవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, జి.రంగన్న మాట్లాడుతూ ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో పెత్తందారి భూస్వామ్య, రెడ్ల చేతిలో అణిచివేతకు గురవుతున్న తరుణంలో వారికి అండగా నిలిచి అనేక భూ పోరాటాలు నిర్వహించి, పేద బడుగు బలహీన వర్గాలకు భూములు పంచిన చరిత్ర కామ్రేడ్ బిజీ మాదన్నదే అన్నారు. చాలామంది పేదలు సంతోషంగా ఉన్నారంటే దానికి కారకులు కామ్రేడ్ బిజీ మదన్న అన్నారు. రైతులుపై అలుపెరుగని పోరాటాలు చేస్తూ వారికి సాగునీటి అందించిన ఘనత అన్నారు. సీపీఐ మండల కార్యదర్శి కామ్రేడ్ పి.రాజీవ్ మాట్లాడుతూ ఎమ్మిగనూరు మండలంలో కామ్రేడ్ బిజీ మాదన్న గారు ఇప్పటికీ పేదల గుండెల్లో సజీవంగా ఉన్నారని ఆయన భౌతికంగా మనలో లేనప్పటికీ వారు పేదల సమస్యల పట్ల రైతు సమస్యల పట్ల పోరాడిన పోరాటాలు సజీవంగా ఉన్నాయని, ఇది ప్రజల ద్వారా వ్యక్తమైందనీ. కొండమ్మచెరువు నిర్మాణం వారి పోరాటాల ఫలితమే అని అంతేకాకుండా వారు అనేక పర్యాయాలు ఎంపీటీసీగా గ్రామ సర్పంచ్‌గా చేశారని వారు స్వర్గీయులు అయినా వారు చేసిన సేవ పోరాటాల వల్లే ఇప్పటికి కె.తిమ్మాపురం గ్రామంలో సర్పంచ్‌గా ఉన్నామని, ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఇకమీదట ఎమ్మిగనూరు మండలంలో ప్రజా సమస్యలపై పోరాటాలు వేగవంతంకై సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం గ్రామ సర్పంచ్ ఉమామహేశ్వరమ్మ సిపిఐ మాజీ నాయకులు చిన్నన్న, సీపీఐ మండల సహాయ కార్యదర్శి బిజీ విరూపాక్షి, గోనెగండ్ల మండల కార్యదర్శి శ్రీరాములు, ఏఐటీయూసీ నాయకులు వీరేష్ తిమ్మ గురుడు రైతు సంఘం నాయకులు మాలిక్ శాంతప్ప. సీనియర్ నాయకులు బజారప్ప తదితరులు పాల్గొన్నారు.

కృష్ణ కుటుంబాన్ని పరామర్శించిన సీపీఐ బృందం

విశాలాంధ్ర- వెల్దుర్తి: సీపీఐ మండల కార్యదర్శి కృష్ణ దంపతుల కుమార్తె మోక్షిత గత రెండ్రోజుల కిందట అనారోగ్యంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. సంఘటన తెలుసుకున్న సీపీఐ బృందం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.రామచంద్రయ్య, కర్నూలు జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నంద్యాల జిల్లా రంగనాయుడు, కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి లక్కీ లెనిన్ బాబు, చేతివృత్తుల సంఘం జిల్లా కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు మనోహర్, కుటుంబాన్ని పరామర్శించారు.

డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ కేంద్రాలను పరిశీలించిన జేసీ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: మెగా డీఎస్సీ 2025 నిర్వహణలో భాగంగా సర్టిఫికెట్ల ధ్రువీకరణ కేంద్రాలను కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నవ్య సందర్శించారు. విద్యాశాఖ రాష్ట్ర అధికారులు ప్రతాప్ రెడ్డి, అబ్రహం, కర్నూలు జిల్లా విద్యాధికారి ఎస్ సామ్యేల్ పాల్, నంద్యాల జిల్లా విద్యాధికారి జనార్దన్ రెడ్డిలతో కలసి రాయలసీమ విశ్వవిద్యాలయంలోని ఆరు కేంద్రాలను పరిశీలించారు. వెరిఫికేషన్ అధికారులకు పలు సూచనలు చేశారు. సర్టిఫికెట్ల పరిశీలన నిమిత్తం ఏయే ప్రమాణాలు పాటిస్తున్నారన్న విషయాలపై అధికారులతో చర్చించారు. క్యాస్ట్ సర్టిఫికెట్ ధ్రువీకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆన్లైన్ విధానంలో ప్రక్రియ మరింత వేగమతం అవ్వాలని ఆలస్యమయ్యేందుకు అవకాశం లేదని రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ నియామకాలపై ప్రత్యేక దృష్టి సారించి అనుకున్న సమయంలో పూర్తి చేయాలని, ఆదేశించిన నేపథ్యంలో ప్రతిష్టాత్మకంగా ప్రక్రియ తీసుకున్నదని వివరించారు.

జిల్లా టాపర్‌కు అభినందనాలు

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మెగా డీఎస్సీ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన ఉపా ధ్యాయ అభ్యర్థులకు సర్టిఫికేట్లు వెరిఫికేషన్ రాయలసీమ యూనివర్సిటీలో ఎంతో ప్రశ్నాత్మకంగా జరిగింది. ఎస్జిటి విభాగంలో జిల్లా టాపర్‌గా మొదటి ర్యాంకు సాధించిన బొల్లం లావణ్యకు ఎస్టీయూ జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకారి, జనార్ధన్, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలాలి, నాయకులు బి.నాగరాజు, బి.సుం కన్న, జి.వీరచంద్ర యాదవ్, రమేష్ నాయుడు, లోక్యానాయక్ అభిన ందనలు తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ఎంతో శ్రమతో డీఎస్సీ కి ప్రిపేర్ అయ్యి జిల్లా టాపర్‌గా నిలవడం ఎంతో గౌరవాన్ని తెచ్చి పెట్టిందన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - నందవరం: నందవరం గ్రామానికి చెందిన రాజోలి ఆంజినేయులు (37) వ్యక్తి పాముకాటుతో మృతి చెందాడు. వివరాలోకి వెళితే ఆంజనేయులు ఈ నెల 25న సోమవారం తన పొలములో గడ్డి కోస్తూ ఉంటే ప్రమాదవశాత్తు పాము కరవగా, కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతూ కోలుకొనలేక 27వ మధ్యాహ్నం చనిపోవడం జరిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. వినాయక చవితితో ఎంత సంబరాలు ఉన్న కాలనీలో పాముకాటుతో ఆంజనేయులు మృతి చెందడంతో విషయ చాయలు అలుముకున్నాయి.

మరిన్ని వార్తలు E-PAPERలో

బాబును నమ్మితే మోసం గ్యారెంటీ

విశాలాంధ్ర - నందవరం: ఎన్నికల ముందు బాబును నమ్మి ఓటేసినందుకు ప్రజలందరికి మోసం గ్యారెంటీ అయిందని వైసీపీ మండల పార్టీ అధ్యక్షుడు జె.శివారెడ్డి, రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కె.ఆర్. లక్ష్మీకాంత్ రెడ్డి, రాష్ట్ర బిసి సెల్ సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డిలు అన్నారు. గురువారం మండల పరిధిలోని గురజాల, రాయచోటి గ్రామాల్లో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి సీఎం చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రజలను మభ్యపెట్టి, అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. జడ్పిటిసి నిఖిల్ చక్రవర్తి, సీనియర్ నాయకులు వెంకటేశ్వర రెడ్డి, నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

కార్యక్రమానికి దుమ్మా కొట్టిన వైసీపీ నాయకులు: వైసీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమానికి మండలంలోని వివిధ స్థాయిలోని నాయకులు డుమ్మా కొట్టారు. అందులో గురజాల సర్పంచ్ వీరస్వామి, పేట శ్రీనివాస్ రెడ్డి, హాలహర్వి రామకోటి రెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, పోనకలదిన్నె నాగరాజు, నదికైరవాడి చాంద్ బాష, వెంకటేష్, ఇబ్రహీంపురం ప్రకాష్ రెడ్డి, మాచాపురం కోటేశ్వర, వివిధ గ్రామాల్లోని వైకాపా ద్వితీయ శ్రేణి నాయకులు దుమ్మా కొట్టారు. దీంతో సామాన్య కార్యకర్తలు మండల వైసీపీలో గ్రూపులు ఏర్పడ్డాయా అని, గ్రూపులతో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందేమో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెచ్చిపోయిన పిచ్చికుక్క
ఆరుగురికి గాయాలు

విశాలాంధ్ర -ఆలూరు: మండలం లోని హత్తిబెలగల్ గ్రామంలో పిచ్చి కుక్క వీరంగం సృష్టించింది. దాదాపు ఐదు మందిని కరిచింది. వివరాల్లోకి వెళితే గ్రామంలో దారిన పోతున్న వారిపై పడి విచక్షణ రహితంగా కరుస్తూ పోయింది. ఈ ఒక్కరోజు 6 మంది ఈ కుక్క కాటుకు బలియై నారు. మస్తాన్ సాబ్, షేక్షావలి, నాగప్ప, నఫీ, రామిబా, గౌతం, వారంతా ఆలూరు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి గ్రామస్తులు తరలించారు. మండల కేంద్రంలో కూడా కుక్కలను పట్టించుకునే నాథుడే కరువయ్యాడని అన్ని గ్రామ ప్రజలు మండిపడుతున్నారు. కుక్కలు చర్మవ్యాధులతో వికారంగా తయారైనాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఇలాంటి ఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. అయినా మండల అధికారులు పట్టించుకోవడం లేదు. వీధి కుక్కల బారిన పడకుండా ఉండడానికి అవగాహన కల్పించడంలో మండల అధికారులు విఫలం అయ్యారు. మండల అధికారుల పర్యవేక్షణ లోపంతోనే వీధి కుక్కలు మండలంలో వీరంగం సృష్టిస్తున్నాయంటున్నారు. కుక్కల బారిన పడకుండా ఉండడానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రజలకు, చిన్న పిల్లలకు అవగాహన కల్పించడం లేదని మండలంలో వివిధ గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోగాల బారిన పడిన పిచ్చి కుక్కలను గ్రామాల్లో నుండి తొలగించి జనాలకు విముక్తి కలిగించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రైతులకు భారంగా మారిన పాసింగ్ పద్ధతిని రద్దు చేయాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆదోని వ్యవసాయ జాతీయ మార్కెట్ యార్డులో కొనసాగుతున్న పాసింగ్ పద్ధతిని తక్షణమే రద్దు చేయాలని కోరుతూ సిపిఐ, ఏపీ రైతు సంఘల ఆధ్వర్యంలో ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, ఏపీ కౌంటర్ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శి మదిరి ఎల్లప్ప, బాసాపురం గోపాల్ గురువారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు, మార్కెట్ యార్డ్ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఒకపక్క దళారీలతో రైతంగం నలిగిపోతుంటే మరోపక్క హమాలీలు మహిళా కూలీల చేతిలో రైతులు మోసాలకు గురవుతున్నారన్నారు. పాసిన్ పేరుతో వేరుసెనగ కాయలు పాసింగ్ చేస్తూ హమాలీ మేస్త్రి ఒక డబ్బా (10 కేజీలు), మహిళా కూలీలు ఒక చాటు (8కేజీలు)పై మాటే తీసుకోవడంతో రైతులు పూర్తిస్థాయిలో నష్టపోతున్నారన్నారు. క్వింటం వేరుశనగ తీసుకువచ్చిన, 100 క్వింటాలు వేరుశనగ తీసుకువచ్చిన ఇదే ధోరణి ప్రవర్తిస్తున్నారని అరికట్టేందుకు పాసింగ్ పద్ధతిలో రద్దు చేయడమే సరైనదన్నారు. తెచ్చిన దిగుబడులను పాసింగ్ చేసిన కూలీలకు వేతనాలు రైతులతో ఇప్పివ్వడం జరుగుతుందన్నారు. నిజంగా మహిళా కూలీలకు అన్యాయం జరిగితే ప్రత్యమ్నాయం చూపాల్సిన అవసరం ప్రభుత్వంపై ఎంతైనా ఉందన్నారు. తక్షణమే పాసీం పద్ధతిని రద్దుచేసి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శుక్రవారం 29, ఆగస్టు 2025

ఉన్నత శ్రేణి ఉద్యోగాన్ని ఎంచుకోవడానికి అవకాశం కల్పించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: మెగా డీఎస్సీలో అభ్యర్థులకు ఉన్నతశ్రేణి ఉద్యోగాన్ని ఎంచుకునేందుకు అవకాశం కల్పించాలని ఎస్టియు జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎంసి సుంకన్న డిమాండ్ చేశారు. గురువారం ఆదోని- కౌతాళం మండలాల ఎస్టీయు ముఖ్య నాయకుల సమావేశం మండల అధ్యక్షుడు చింతకుంట రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశాన్ని ఉద్దేశించి ఎంసి సుంకన్న మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో డీఎస్సీ ఫలితాలు విడుదలకు చేయడం జరిగిందని, అందులో వివిధ రకాల ఉపాధ్యాయ ఉద్యోగాలు ఉండటం వలన దరఖాస్తు చేసుకునే సమయంలో అభ్యర్థులు ప్రాధాన్యత క్రమంలో ఎంచుకోవడం జరిగిందన్నారు. అయినప్పటికీ ఒక అభ్యర్థి ఉన్నతశ్రేణి ఉద్యోగానికి అర్హత సాధించినప్పటికీ ప్రాధాన్యత క్రమంలో దివశ్రేణి ఉద్యోగం చూపడం ద్వారా ఆ అభ్యర్థి ఉన్నతశ్రేణి ఉద్యోగాన్ని కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఉద్యోగ అభ్యర్థి ప్రాధాన్యత క్రమంలో దిగువశ్రేణి ఉద్యోగానికి అప్లై చేసిన కూడా ఉన్నతశ్రేణి ఉద్యోగానికి అర్హత సాధించినప్పుడు ఉన్నతా శ్రేణి ఉద్యోగానికి వెళ్లే అవకాశం కల్పించాలని కోరారు. ఎస్టీయూ జిల్లా ఆర్థిక కమిటీ సభ్యుడు రామాంజనేయులు, ఎస్టీయూ సీనియర్ నాయకులు సత్యన్న మాట్లాడుతూ ఇటీవల కాలంలో పాఠశాల స్థాయిలో పరీక్షలకు అసెస్మెంట్ పుస్తకాలలో విద్యార్థి యొక్క ఫలితాలు నమోదు చేయడంలో ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారన్నారు. వెంటనే అసెస్మెంట్ పుస్తకాలను రద్దుచేసి పరీక్షలను విద్యార్థులు, ఉపాధ్యాయులకు సౌలభ్యంగా ఉండేటువంటి పాత విధానాన్ని కొనసాగించాలన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఎస్టియు ఆదోని మండలం ప్రధాన కార్యదర్శి సుధాకర్ బాబు, ఆర్థిక కార్యదర్శి శేక్షావలి, సీనియర్ నాయకులు సూర్యుడు, అంజినయ్య, లక్ష్మన్న, గణేష్, రామ్మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, చిరంజీవి పాల్గొన్నారు.

జీఐఎస్, ఐజీఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి

విశాలాంధ్ర - కర్నూలు సిటీ: ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ రీడ్రెసల్ సిస్టమ్ (ఐజీఆర్ఎస్), జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వివరాల ఆధారంగా ఆస్తి పన్ను మదింపు త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారు స్థానిక ఎస్బిఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో రెవెన్యూ విభాగం సిబ్బంది, అడ్మిన్‌లతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ఆస్తి పన్ను మదింపు ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకతను సాధించడానికి ఆధునిక సాంకేతిక పద్ధతులను వినియోగించా లన్నారు. ఇందుకోసం ఐజీఆర్ఎస్ ద్వారా రిజిస్ట్రేషన్ల ఆధారంగా ఆస్తి వివరాలను పునః పరిశీలించి, ఆస్తి పన్నును సవరించాలన్నారు. జీఐఎస్ ద్వారా భౌగోళిక సమాచారం, స్థల వివరాలు సమన్వయం చేసి ఆస్తి మదింపులో తప్పులు రాకుండా చూడాలని సూచించారు. రెవెన్యూ సిబ్బంది ఈ పద్ధతులపై పూర్తి అవగాహనతో కర్తవ్యనిష్ఠతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, ఆర్ఓ జునైద్, వాజీద్, ఆర్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందరూ సంతోషాలతో జీవించాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: వినాయకుడి ఆశీస్సులు, ఆశీర్వాదాలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో జీవించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా పేర్కొన్నారు. వినాయక చవితి పండుగ సందర్భంగా కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన గణనాథునికి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, కలెక్టర్ కుమారుడు శ్రీదీప్, జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ సర్వ విఘ్నాలను అధిగమించి జయమును కలిగించే వినాయకుడి ఆశీర్వాదాలతో ప్రజలందరూ వినాయక చవితి పండుగను సుఖ సంతోషాలతో జరుపుకోవాలని, జిల్లా అభివృద్ధి పథంలో నడవాలని వినాయకుడికి పూజల నిర్వహించారు.

సీబీఎస్ఈ సౌత్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో రిడ్జ్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక లక్ష్మీపురం సమీపంలోని రిడ్జ్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సిబిఎస్ ఈసౌత్‌జోన్-1 తైక్వాండో ఛాంపియన్షిప్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఆగష్టు 21 నుండి 24 వరకు ప్రకాశం జిల్లా మార్కాపురంలోని కమలా స్కూల్లో జరిగిన ఈ పోటీలలో 1 బంగారు పతకం, 3 రజత పతకాలు, 1 కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. పతకాలు పొందిన విద్యార్థులు వరుసగా యశ్వంత్రెడ్డి, కీర్తి, భరత్, శివ విఘ్నేష్ రెడ్డి, స్నికిత పతకాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల సిఇఓ గోపీనాథ్ అభినందనలు తెలియజేశారు. కో-సిఇఓ సౌమ్యగోపీనాథ్, డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపల్ రాజ్కమల్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. ఈ ఘనతకు కారకులైన తైక్వాండో మాస్టర్ సుందర్రాజున్ను పాఠశాల యాజమాన్యం వారు ప్రత్యేకంగా అభినందించారు.

ఉపాధి హామీ పథకం కింద వందశాతం సబ్సిడీకి పండ్ల మొక్కల పంపిణీ

విశాలాంధ్ర - పాములపాడు : ఉపాధి హామీ పథకం కింద రైతులకు వందశాతం సబ్సిడీ తో పండ్ల మొక్కలను పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఆవరణలో ఏపీవో జయంతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొని రైతులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం రైతులకు వందశాతం సబ్సిడీతో పండ్ల మొక్కలను పంపిణీ చేస్తుందని ఇంతవరకు మండలంలో 80 ఎకరాలకు పండ్ల మొక్కలను పంపిణీ చేయడం జరిగిందని వారు తెలిపారు. ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, రైతులు పాల్గొన్నారు.

మండల అధ్యక్షుడుగా దామోదర్ నాయుడు

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: టిడిపి మండల అధ్యక్షుడిగా పి.దామోదర్ నాయుడును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గురువారం ఆయన అన్నారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చొరవతో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా మండల అధ్యక్షులుగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ కార్యక్రమంలో పాల్గొంటూ గ్రామాల్లో పార్టీ అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేశానని ఆయన తెలిపారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కు, జిల్లా అధ్యక్షుడు తిక్క రెడ్డికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు తన మీద ఎంతో నమ్మకం ఉంచి అధ్యక్ష పదవిని ఇచ్చారన్నారు.

ఘనంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి దినోత్సవం

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి దినోత్సవం వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎంఆర్‌పిఎస్ ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, మండల అధ్యక్షుడు పిచ్చిళ్ళ మేఘప్రతాప్ ఆధ్వర్యంలో స్థానిక అడ్డవాగు సెంటర్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి వికలాంగులచే కేక్ కట్ చేసి పంచి సంబరాలు చేసారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంఆర్‌పిస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పోరాటం వల్లే వికలాంగుల పింఛన్ మొత్తం పెరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు లక్ష్మీనారాయణ. శివ బాల, ఓబన్న, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కదళీ పూర్ణఫల మహా గణపతిని దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల సంజీవనగర్ శ్రీ కోదండ రామాలయం నందు శ్రీ భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈ సంవత్సరం శ్రీ కదళీ పూర్ణఫల మహా గణపతిగా వినాయకుడు కొలువుతీరాడు. తొలి పూజ కార్యక్రమంలో మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవి సుబ్బారెడ్డి, రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి, ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ జి. రవికృష్ణ తదితర ప్రముఖులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భగవత్ సేవా సమాజ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బిర్లా ఓపస్ పెయింట్‌తో రంగుల వేడుకలు

విశాలాంధ్ర - బళ్లారి చౌరస్తా : బిర్లా ఓపస్ అత్యుత్తమ హస్తకలను ప్రదర్శించే వివిధ రకాల ఇంటీరియల్ పెయింట్లు అందిస్తుందని, వాటిని ఉపయోగించడం ద్వారా ఇంటిలో రంగుల వేడుకలు చూడొచ్చని రీజినల్ మేనేజర్ సుమన్ రెడ్డి తెలిపారు. గురువారం బళ్లారి చౌరస్తా రోడ్డులో బిర్లా ఓపస్ పెయింట్ ద్వితీయ స్టోర్‌ను క్లాస్ వన్ కాంట్రాక్టర్ పల్లె ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం రీజినల్ మేనేజర్ సుమన్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పలు కంపెనీలు నిర్వహిస్తున్న ఆదిత్య బిర్లా గ్రూప్ ఏడాది క్రితమే పెయింటింగ్ లో అడుగుపెట్టిందన్నారు. అనతి కాలంలోనే బిర్లా ఓపస్ పెయింట్ కస్టమర్ల ఆధారాభిమానులు చూరగొందని పేర్కొన్నారు. స్టోర్ ను స్వయంగా సందర్శించి నచ్చిన పెయింటర్ కస్టమర్ల కోసం ఎంచుకోవడానికి ప్రత్యేకంగా కన్సల్టెంట్ ను ఏర్పాటు చేశామన్నారు. బిర్లా ఓపస్ అన్ని రకాల పెయింట్ లో ఆఫర్లు కూడా ఉన్నాయని, 20 లీటర్ల పై రెండు లీటర్లు 10 లీటర్ల పై ఒక లీటర్ పెయింట్ ఉచితంగా అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ సురేష్ రెడ్డి, నిర్వాహకులు వెంకట సుబ్బారెడ్డి శ్రీకాంత్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈద్గా నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి

విశాలాంధ్ర - హొళగుంద: మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను గురువారంకలిసిన హొళగుంద మండల సిబిఎన్ ఆర్మీ అధ్యక్షుడు ముల్లా.మోయిన్ టీడీపీ మండల కన్వీనర్ వీరనగౌడ హొళగుంద మండల కేంద్రంలోని ఈద్గా కు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చెయ్యాలంటూ రాష్ట్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ హొళగుంద మండల సిబిఎన్ ఆర్మీ మోయిన్ కోరారు. మండల కేంద్రంలో ముస్లింలు అత్యధికంగా జనాభా ఉన్నారని, ముస్లింల ఈద్గాకు కాంపౌండ్ వాల్ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ముస్లిం కవర్ స్థానంకు కాంపౌండ్ గోడ నిర్మించాలని అన్నారు. ముస్లిం మైనార్టీ యువతి ,యువకులకులకు మైనార్టీ రుణాలు మంజూరు చేయాలని, విద్యార్థులకు స్కాలర్షిప్‌లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ముస్లిం మైనార్టీ వ్యవహారాల శాఖ మంత్రి ఎన్ఎండి ఫారుక్ స్పందిస్తూ ఈద్గాకు కాంపౌండ్ వాల్ నిర్మాణానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ వీరనగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా కొలువుదీరిన బొజ్జ గణపయ్యలు

విశాలాంధ్ర - కోడుమూరు: వినాయక చవితి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని కోడుమూరు పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలోని ఆయావీధులలో బొజ్జ గణపయ్యలు కొలువుదీరి భక్తులచే విశేష పూజలు అందుకుంటున్నారు. పట్టణంలోని అన్ని ఆలయాల్లో, ఆయా ప్రధాన వీధులలో, సందుల్లో వాడ వాడల గణనాథులు కొలువుదీరి, భక్తిశ్రద్ధలతో భక్తులు అందించే విశేష పూజలు అందుకొని,వినాయక చవితి ఉత్సవ సంబరాలను ఆస్వాదిస్తున్నారు. వినాయక చవితి ఉత్సవాల సంబరాలు సందర్భంగా బుధవారం ఉదయం నుంచి ఆయావీధుల్లో విద్యుత్ దీపాలు, పూలు తదితర ప్రత్యేకమైన అలంకరణలతో పెద్దఎత్తున మంటపాలను ఏర్పాటు చేసి, భక్తులు పెద్దపెద్ద గణపతి విగ్రహాలను ప్రతిష్టించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. యువతీ, యువకులు, చిన్నారులు, మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో బొజ్జ గణపయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, విఘ్నాలు తొలగించి జీవితాల్లో వెలుగులు నింపాలని వేడుకుంటూ విఘ్నేశ్వరుడికి కాయ కర్పూరం, నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. బుధవారం నుంచి మూడు రోజులపాటు ప్రజలచే పూజలు అందుకున్న గణనాథులకు శుక్రవారం నిమజ్జనం చేస్తారు.

ప్రత్యేక ఆకర్షణగా చౌడేశ్వరిదేవి భక్త వినాయకుడి మట్టి విగ్రహం : పట్టణంలోని తేరుబజారు వీధిలోని చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద అందంగా అలంకరించిన మంటపంలో చౌడేశ్వరిదేవి భక్త వినాయక బృందం సభ్యులు ప్రతిష్ఠించిన అతి పెద్ద మట్టి విగ్రహం కోడుమూరు పట్టణములోని ప్రజలు,భక్తులందరినీ విశేషంగా ఆకర్షిస్తుంది. ఆలయం వద్ద వినాయకుడి విగ్రహం చూసేందుకు బుధవారం, గురువారం భక్తులు భారీగా బారులు తీరారు. పట్టణంలో అన్ని మండపాల్లో కొలువుదీరే గణనాథుల్లోకి చౌడేశ్వరిదేవి భక్త వినాయకుడు ప్రతి ఏటా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాడు. ఇదిలా ఉండగా బుధవారం ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు శుక్రవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించేందుకు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వెల్దుర్తి రోడ్డులోని పట్టణ శివారులో వినాయక ఘాటు వద్ద భక్తులు వీక్షించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండల వ్యాప్తంగా గణేష్ ఉత్సవాలలో భాగంగా రెండో రోజు గురువారం వినాయకు నికి భక్తులు ప్రజలు పూజలు చేశారు. వినాయక చవితి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలలో బుధ వారం మండపాలలో శ్రీ వినాయక విగ్రహాలను భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలతో ఏర్పాటు చేశారు. మహిళలు భక్తులు వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు. ప్రత్యేక విద్యుత్ దీపాల అలంకరణలతో మండపాలను అందంగా తీర్చిదిద్దారు. మండల వ్యాప్తంగా 165 విగ్రహాలను ఏర్పాటుచేసినట్టు పోలీసులు తెలిపారు. రెండు రోజులుగా ఆయా గ్రామాలలో సందడి నెలకొంది. వీధులన్ని వినాయక భక్తి పాటలతో హెూరెత్తుతున్నాయి. గ్రామాలలో ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు జరుపుకునేల పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు సహకారం అందిస్తున్నారు. మూడవ రోజు గణేష్ నిమజ్జనం ఆయా గ్రామాలలో చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. అయితే గతంలో ఎన్నడూలేని విధంగా మండపాలలో ఏర్పాటు చేసేందుకు గణేష్ విగ్రహాలను తీసుకువచ్చేటప్పుడే డప్పు వాయిద్యాలు, బాన సంచలతో స్వాగతం పలకడం విశేషం.

విశాలాంధ్ర- ఎమ్మిగనూరు రూరల్: స్థానిక కొండవీటి ప్రాంతంలో వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణపతి బప్పా మోరియా నినాదాలతో భక్తి శ్రద్ధలతో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వినాయక యోగ మండలి సెక్రటరీ తెలుగు రాముడు మాట్లాడుతూ 1992వ సంవత్సరం నుండి 34 ఏళ్లుగా వినూత్న రీతిలో వినాయక విగ్రహాలను పర్యావరణ పరిరక్షణ దృష్టిలో ఉంచుకొని మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నామన్నారు. ఎలాంటి కెమికల్స్, పెయింట్స్ వాడకుండా పూజ సామాగ్రి అయిన పసుపు, వేలాకలో, లింగాలు, గోడంబి, ద్రాక్షవక్కలు తదితర వస్తువులతో చేస్తున్నాం. ఈ సంవత్సరం 16 అడుగుల వినాయక విగ్రహాన్ని రెండు నెలల పాటు కొండవీటి ప్రాంత వినాయక మండల సభ్యులైన బండా శేఖర్, రఘువీరా, షఫీ, అశోక్ తదితర సభ్యుల కృషితో ఈ విగ్రహాన్ని వింజమొర ఈకలు, అయ్యప్ప మాల ధారణ పూసలతో ఎంతో అద్భుతంగా తయారు చేయడం జరిగింది. ఈ వినాయక చవితి సందర్భంగా బాల వినాయక మండలి ఆధ్వర్యంలో పేద మహిళలకు, అనాథ, నిరుపేద విద్యార్థులకు, చీరలు, బుక్స్, పెన్సు ఇవ్వడం జరిగింది.

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ: ఉయ్యాలవాడ మండలంలోని మాయలూరు అల్లూరు కాకరవాడ. హరివరం ఇంజేడు. ఆర్.పాంపల్లి, ఆర్.జమల్దిన్నె, పుచ్చకాయలపల్లె, గోవింద పల్లె, తిరుమల దీన్నే తదితర గ్రామాలలో బుధవారం వినాయక చవితి పండుగ కావడంతో అన్ని గ్రామాల్లోని వీధులలో గణనాధుని విగ్రహాలు వెలిశాయి. ప్రత్యేకంగా పూజల. అనంతరం స్వామివారిని కుందునదిలో నిమజ్జనం భావిస్తారని. వినాయక మండపాల కమిటీ పెద్దలు తెలిపారు. అలాగే ఆర్ జమ్మలదీన్నేలో అర్చకులు కీర్తి లక్ష్మి స్వామి. అభయాంజనేయ స్వామి ప్రత్యేకంగా పూజలు జరిపించి. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

విశాలాంధ్ర - గూడూరు: వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని గణేష్ మండపాలు భక్తులతో సందడి నెలకొంది. గురువారం గూడూరు నగరం పంచాయతీ లోని శ్రీకృష్ణ దేవాలయం,శ్రీ రాముడు దేవాలయంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను టిడిపి పట్టణ అధ్యక్షుడు, మాజీ వైస్ చైర్మన్ కే రామాంజనేయులు, సింగల్ విండో డైరెక్టర్ రేమట వెంకటేష్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా గణేష్ మండపం నిర్వాహకులు నేతలను ఘనంగా స్వాగతం పలికి శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. కౌన్సిలర్ షాషావలి, టిడిపి నేతలు వీర కుమార్, వాల్మీకి పట్టణ అధ్యక్షుడు పుట్టపాశం బాబు, నాగప్ప యాదవ్, నరసింహుడు, సునీల్ కుమార్ గౌడ్, కర్ణ రంగస్వామి, అయ్య స్వామి పాల్గొన్నారు.

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి, వినాయక చవితి వేడుకలను జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎన్. యుగంధర్ బాబు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నిత్యం శాంతి భద్రతల పరిరక్షణలోహడావిడిగా ఉండే పోలీసు జీవితంలో వినాయక చవితి సందర్భంగా సిబ్బందితో కలిసి ఆ విఘ్నేశ్వరునికి పూజలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని, జిల్లా పోలీస్ కార్యాలయంలో పండుగ వాతావరణం నెలకొనిందని ఎస్పి అన్నారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని ఏర్పాటు చేసిన పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. ఎస్పీతో పాటు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి శ్రీనివాస్ రెడ్డి, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశాలాంధ్ర - వెలుగోడు : మండలంలో వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా వెలుగోడు పట్టణంలో 40 వినాయక విగ్రహాలను, మండలంలోని 7 గ్రామాలలో 39 వినాయక విగ్రహాలను పండుగ రోజు ప్రతిష్ఠించి ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్‌లో డా.లింగారెడ్డి ఆసుపత్రి ఎదురుగా, పోస్టాఫీసు ఎదురుగా, వెంకటేశ్వర స్వామి గుడి వద్ద 16అడుగుల వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. ద్వారకానగర్ ఆంజనేయ సప్లైర్స్ యజమాని నాగన్న సొంత ఖర్చులతో డెకరేషన్ చేసి ప్రతిష్ఠించారు. ప్రత్యేక అలంకరణతో, విద్యుత్ వెలుగులతో అందరిని ఆకర్శించింది. గురువారం ఆత్మకూరు రూరల్ సిఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్ఐ సురేష్ వినాయక మండపాలను పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

నిత్యం ప్రజా కార్యక్రమాల్లో గుడిసే కృష్ణమ్మ

విశాలాంధ్ర - ఆదోని రూరల్: నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా అవసరాలు తెలుసుకుని పరిష్కరానికి కృషి చేయడం తన పనిగా భావిస్తున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, నియోజకవర్గ మాజీ ఇంచార్జి గుడిసె ఆది కృష్ణమ్మ బుధవారం కొలువుదీరిన వినాయక మండపాలను సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలో ఏ వీధికి వెళ్లిన వినాయక మండపాలు దర్శనమిస్తున్నాయి.మండిగిరి, రాజీవ్ గాంధీ నగర్, విక్టోరియా పేట పలు కాలనీలలో వినాయక మండప నిర్వాకుల ఆహ్వానం మేరకు గుడిసి ఆదికృష్ణమ్మ కుటుంబ సభ్యులతో వెళ్లి మండపాలను సందర్శించి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మండప నిర్వాహకులతో మాట్లాడుతూ వినాయక మండపనిర్వాకులు ఎంతో ప్రతిష్టాత్మకంగా క్రమశిక్షణతో వినాయక పండుగను జరుపుకోవడం మంచి శుభ పరిణామం అన్నారు. మండపాల వద్ద పలు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. వర్షాకాలం అయినందున విద్యుత్ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మండపాల వద్ద ఎటువంటి సంఘటనలు తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలతో వేడుకలు జరుపుకోవాలని వినాయక మండప నిర్వాహకులకు సూచించారు.కులం ఏదైనా మతం ఏదైనా వినాయక పండగ అన్నది అందరినీ కలుపుతూ ఏకతాటిపైకి తీసుకురావడం ఏంతో ఆనందించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళి, నాగరాజు, సాదిక్వలి, మాజీ సర్పంచ్ మాధవ, గోపాల్, మునిస్వామి, వెంకటేష్, లక్ష్మీనారాయణ, బాబురావు, శంకర్, రాజు, విజయ్ పాల్గొన్నారు.

బదిలీ అయిన మేనేజర్‌కు ఘన సన్మానం

విశాలాంధ్ర - క్రిష్ణగిరి: చిట్యాల మేనేజర్‌గా పనిచేస్తూ బదిలీ అయిన మేనేజర్ నాగలింగేశ్వరయ్యకు గ్రామ సర్పంచ్ గ్రామ నాయకులు బ్యాంకు సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ చిట్యాల గ్రామీణ బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న నాగలింగేశ్వర బ్యాంకు లావాదేవీలకు వచ్చే కస్టమర్లకు ఎలాంటి అసౌకర్యం కాకుండా పనిచేశారన్నారు. రైతుల రుణాలు , పొదుపు మహిళా రుణాల విషయంలో ఎలాంటి జవం లేకుండా వెంటనే పనిచేశారన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొరేషన్ల లబ్ధిదారులకు బ్యాంకులకు వచ్చే రాయతీ చెల్లించడంలో పదేపదే తిప్పేవాడు కాదన్నారు. ప్రస్తుతం వచ్చిన మేనేజర్ కూడా బ్యాంకు వేళలో ప్రజలకు అందుబాటులో ఉండి పనిచేయాలని ఆయన కోరారు. బ్యాంకు సిబ్బంది జవహర్ లాల్, వాసంతి, గణేష్, రమేష్, హరి, సుధాకర్, శ్రీధర్ గౌడ్, సుంకన్న, చెన్నయ్య, సురేష్, చిన్న మాదన్న, రామాంజనేయులు రాజు, సురేంద్ర, పెద్దయ్య, లాలప్ప ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయ మూర్తి జి. కబర్థి సూచనల మేరకు ఐఐఐటీ డీఎం రిజిస్టర్ రాజ్ కుమార్ మాంఝీవాల్ ఆధ్వర్యంలో కర్నూలు సిబిఐ జిల్లా జడ్జి శోభా రాణి మరియు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి బి.లీలా వెంకట శేషాద్రి, తాండ్రపాడు నందు గల ఐఐఐటీ డీఎం నందు నూతన విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. శోభా రాణి జడ్జి మాట్లడుతూ లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం మరియు మాదక ద్రవ్యాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం లీలా వెంకట శేషాద్రి జడ్జి మాట్టాడుతూ పీసీ ఆర్ చట్టం, ఎస్సి ఎస్టీ అట్రాసిటీ యాక్ట్, ర్యాగింగ్ చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో కాలేజీ డీన్ సత్తిబాబు మరియు ప్రొఫెసర్ లు విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం అన్ని దానాలు కన్నా గొప్పది

విశాలాంధ్ర - హొళగుంద: మండలంలోని ఎండీ హళ్లిలో గురువారం గోపి చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఆధ్వర్యంలో రక్తదాన కార్యక్రమం జరిగింది. సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ రక్తదానం అన్ని దానాల కన్నా గొప్పదని అన్నారు ప్రజలందరూ రక్తదానం చేసి ప్రాణాలు నిలబెట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఆసుపత్రుల్లో రోగులకు అత్యవసర వేళల్లో రక్తం దొరకక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు అని అందువల్ల ప్రతి ఒక్కరు రక్తదానం చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. యువకులు రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వీర నాగప్ప, హనుమంతు, ఖాదర్ భాష, లక్ష్మన్న, శరణ, శివ, ఆర్ఎంపీ డాక్టర్లు మంజు, ప్రసాద్, మహేష్, యువకులు మల్లి, సుభాన్, పీర, సిద్ధ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలని

విశాలాంధ్ర - ఆస్పరి : ఎలాంటి అపశృతులు చోటు చేసుకోకుండా వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ గంగాధర్ గణేశ్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులకు సూచించారు. గురువారం మండల కేంద్రం సమీపంలోనే ఆదోని రోడ్డు ప్రక్కన ఉన్న ఊరు చెరువులో ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం ప్రాంతాన్ని సీఐ గంగాధర్, సర్పంచ్ రాదమ్మ భర్త జిల్లా కేడీసీసీ మాజీ డైరెక్టర్ రాఘవేంద్ర లు పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకే వినాయక ప్రతిమల విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలన్నారు. డీజే లు లవ్డ్ స్పీకర్లు అనుమతి లేదన్నారు. భక్తిశ్రద్ధలతో నిమజ్జనం కార్యక్రమం పూర్తి చేసుకోవాలన్నారు. నిమజ్జనం ప్రాంతంలో వృద్ధులు, పిల్లలు లేకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.